# దేవుడితో ముగ్గురం, ఇకేమి?

అక్కరాజు ఆంజనేయులు, బి. ఏ.,

౧

"సరోజినీ, సరోజినీ! ఏమే సరోజినీ! నీదుంప తెగా, ఇల్లెత్తిపొయ్యేటట్టుకేకలు వేసినా పలకవు. ఒసే సరోజినీ!" అంటూ కోపంతో అరుస్తూ కమలమ్మ వాకిట్లోకి వచ్చింది. సరోజిని మంచం మీద పండుకొని చేతులతో పిలుస్తూ "చందమామ రావే, జాబిల్లి రావే, బండెక్కిరావే, బంతిపూలు తేవే" అని పాడుతూ మధ్య మధ్య చప్పట్లు కొడుతూ ఉంది. పిల్ల ఆటచూచేసరికి అమ్మకోపం ఆకాశాన పోయింది. కమలమ్మ వచ్చి మంచంలో కూర్చొని పిల్లను ముద్దు పెట్టుకొంటూ, బొడ్డులో వేలుపెట్టి చక్కిలిగింత పెడుతూ లాలన చేసి "తల్లీ, ఇక అన్నానికి రావూ?" అంది.

సరో:—ఆఁ, నువ్వు నెయ్యివెయ్యవు. ఆపాడు కారం పచ్చడితో ఖై తినలేను. నాకొద్దు పో.




"...నెయ్యిముంత దించి కొంచెం వేస్తుండగా..."

కమ:— ఎట్లనో నాలుగుముద్దలు తినకుంటే ఎట్లు?

సరో:— ఆఁ, రోజూ ఇంతే. మాటలు చెప్పడానికేమి? రోజుకొంటూ తినేదానికి నాకు్కదూ ఆకష్టం తెలుస్తుంది?

కమ— రోజూ ఇంతేనంటావా? బావవచ్చి పోయినప్పటినుంచేకదూ లేకపోవడం? రేపు మళ్లీ అప్పతద్దినం, కావలసినంత వేసుకో.

సరో:—ఛీ, ఎవరు పెంచమన్నారు? చంపి వెయ్యకపోయినావా? ఈబాధ లేకపోనే.

కమ—కడుపుతరుక్కొ నిపొయ్యేటట్టు మాట్లాడుతావుకదే! తల్లీ, రేపుపొద్దున అన్నవస్తాడు, తద్దినానికి. లే, అన్నంతిని పెందలాడే పండుకొంటే, పొద్దున నాకు పుట్టెడు పనిఉంది. వడలన్నా చెయ్యక తప్పదు. రేపు నీకు వడలూ, అన్నఏమైనా తెస్తే అవీ తిండానికి కావలసినన్నీ.

సరో—అయితే అన్నవస్తాడూ?

కమ—వస్తాడు, నీకు తిండానికి తెస్తాడు.

సరో—అన్నవస్తాడు, అన్నవస్తాడు.

అంటూ చప్పట్లు కొట్టుకొంటూ, అమ్మచంక యెక్కింది. కంచం చూచే సరికి రోజను మొదలు పెట్టింది. పిల్లను కంచంముందర కూర్చోబెట్టి, రేపటికి దేవుడున్నా డనుకొని, తద్దినానికని పిల్లకుకూడా కడుపుకట్టి నిలవచేస్తూవచ్చిన నెయ్యిముంత దించి కొంచెంవేస్తుండగా సరోజిని "ఆఁ, అంతావెయ్యి" అంటూ, ఎంగిలిచేత ఒడిసిపట్టి లాగి దొర్లించుకొంది సరోజిని. కంచంలో నేతిముద్ద పడింది; పిల్లవీపున దెబ్బలు పడ్డాయి. లేమివల్లకలిగినదుఃఖంచేత వచ్చిన కోపంలో కొట్టిందేగాని, మళ్లీ తన్నుతానే 'బంగారుతల్లిని కొడితినీ పాడుముండనూ' అని తిట్టుకొంటూ, ఏడుస్తూ గోడను చేరబడ్డది. పిల్ల ఆత్రంతో నెయ్యి ముందుతిని మరి అన్నం తిన మొదలుపెట్టింది.

పిల్లనుకొట్టినదెబ్బలు వినబడికాబోలు భానుమూర్తి పరుగెత్తుకొంటూ లోపలికి వచ్చాడు. భానుమూర్తీ, కమలమ్మకొడుకు శ్రీహరీ, స్నేహితులు. చిన్నప్పటినుంచీ ఒకటిగా చదువుకొంటూ, ఆడుకొంటూ, ఆలోచిస్తూ పెరిగారు. భానుమూర్తికి అమ్మా నాయనా ఒక్కమారు చనిపోవడంవల్ల, సంసార భారం తలపైనబడి, భూములపైన పెత్తనం చేసేవారు లేక తాను ఆరోఘారంతో బడిచదువు మానాడు. శ్రీహరికి తండ్రిపోయి ఆయనహానీకేసులో మూడుకోర్టులూ తిరగడంలో ఆస్తిపోయి, అమ్మనూ, చెల్లెలినీ పోషించేభారం తలమీద పడినా, ఏమి పెట్టి పోషించడం? భానుమూర్తిలాగా పైపెత్తనం చెయ్యడానికి ఊళ్లో ఉండే ఆస్తిఅంతా పోయింది. తనకున్న కొంచెం చదువుతో ఏఉద్యోగమూ దొరకలేదు. అందువల్ల ఊరూరూ తిరిగి తనమంచితనం, నేర్పూ, తెలివితేటలచేత తన్ను తానే చదివించుకొంటున్నాడు. సహపాఠులిద్దరూ ఇప్పుడు వేరైనా, మనస్సులొకటిగానే ఉన్నాయి. కొడుకు దగ్గరలేని కమలమ్మకు భానుమూర్తినిచూస్తే ఏనుగునెక్కినంత సంతోషం. భానుమూర్తి కమలమ్మను అమ్మా అని పిలుస్తూ కొడుకును మరపించాడు.

ఎంతకష్టాలలో ఉన్నా, అనాదిగా పెట్టిన చెయ్యేగాని పట్టినచెయ్యి కాకుండా బ్రతికి పెద్దల ఆర్వేలనియోగివంశంలోది కాబట్టి, ఇట్టి స్థితిలోకూడా ఇతరుల ఋణం పైన ఉంచుకోదు కమలమ్మ. ఇక భానుమూర్తి కమలమ్మతో ఆమెకష్టాలనుగురించి మాట్లాడడానికి సందేహించేవాడు, భయపడేవాడు. పౌరుషవంతులు తమకష్టాలు ఇతరులతో చెప్పుకోరు; మరిన్నీ, ఏవిధంగానన్నా ఇతరులు తెలుసుకొంటే తలవంపులైనట్టు భావిస్తారుకదా! అందువల్ల తనకు సహాయం చెయ్యడానికి ఎంతఇష్టమున్నా "ఇది తీసుకో అమ్మా" అని అడగడానికికూడా భయపడేవాడు. ఇంట్లో తిండికి కూడా ఇబ్బంది పడుతూ ఉంది కమలమ్మ అని తానెరుగును.

దెబ్బలు వినబడగానే, భానుమూర్తికి దుఃఖమూ, భయమూ కలిగాయి. అన్నం తింటూ ఏమీతోచక ఎంగిలిచేత్తో పరిగెత్తాడు. సరోజిని పచ్చడిఅన్నం తింటూ, గోడ చేరబడి కన్నీళ్లు కారుస్తుండే అమ్మను చూస్తూ విచారంగా ఉంది. భానుమూర్తి హఠాత్తుగా ప్రవేశించాడు. తటాలున మొగంతిప్పి, కొంగుతో కన్నీరు అద్దుకొని, పొంగివచ్చే దుఃఖాన్ని అణచుకోలేక, అణచుకోలేక అణచుకొని, సగమణిగినగొంతుతో, 'భానూ, రారా' అంది కమలమ్మ.

ఆవలిస్తే పేగులెంచేజాతికదా ? రెప్పపాటులో అంతా గ్రహించాడు: 'చెల్లీ, రా' అని సరోజినిని ఎత్తుకొన్నాడు ; అమ్మముఖం చూస్తూ తడబడుతూ వెళ్లాడు.

గది శుభ్రం చేసి కమలమ్మ పండుకొంది. ఎంత ప్రేమ తనకు ఎక్కువైనా, భానుమూర్తి తనకంటే ఎక్కువ ఆదరం చూపగలడు పిల్లవిషయంలో. అయినా, తనదగ్గర లేనంతమాత్రంచేత, సరోజిని క్షేమోలోటు అయ్యేటట్టుగా మూడునాలుగుమార్లు వెళ్లి చూచివచ్చింది కమలమ్మ. ఇందులో తెల్లవారితే తద్దినమనే ఆలోచన బుర్రలోకి వచ్చింది. శ్రీహరి వచ్చేబండికి బాడుగ ఇచ్చుకోవాలి; తిరిగివెళ్లడానికి ప్రయాణపుఖర్చు ఇచ్చుకోవాలి. తద్దినపుఖర్చుకాక బ్రాహ్మలకు దక్షిణలు ఇచ్చుకోవాలి. పన్నెమాసాలు తిరిగివచ్చిన ఈ కర్కోటకపుబ్రాహ్మలు తలకు అర్ధరూపాయ భోజనాలకుముందు ఇస్తేనేగాని ముద్ద యెత్తరు. "ఏమిచెయ్యడం భగవంతుడా!" అని కమలమ్మ ఏమీతోచక కుళ్లిపోతూ ఉంది. నిద్ర పట్టదు.

దరిద్రంలో తనకు కలిగిన ఒక ఆలోచనకు సంతోషించింది. పౌరోహితుడు గణపతిశాస్త్రికి ఈ తద్దినపుసంగతి ముందుగా చెబితే, మరియిద్దరితో ముగ్గురుగా తయారౌతాడు. తద్దినంనాడు పొద్దున తెలిపితే, ఆవూళ్లో ఇక వైదీకులు లేరు కాబట్టే, పైవూరికి వెళ్లి పిల్చుకొనివచ్చే వ్యవధి ఉండదు కాబట్టే, తాను ఒకడే వస్తాడు. ఖర్చు తగ్గుతుంది; దక్షిణ మిగులుతుంది. ఇదీ ఆమెకు తోచినయుక్తి. ఇది తోచబట్టే ఆమె ఒకమనిషిగా తెల్లవారి లేచింది.

కండ్లు తెరిచేసరికి, శ్రీహరి పక్కలో కూర్చొని అమ్మముఖం చూస్తున్నాడు. సరోజిని అన్నపక్కను కూర్చొని ముంతమామిడిపప్పు తింటూఉంది. 'ఎంతసేపైంది శ్రీహరీ, వచ్చి? అబ్బా, ఎంతఎండబడ్డది? తల్లీ, లేవనీ, పుట్టెడుపని ఉంది" అనుకొంటూ ప్రక్కలోనుంచి లేచింది. "బండిమనిషి యేడి నాయనా? బాడిగ ఎంతయివ్వాలి?" అని బెంగతో అడిగింది. అటూఇటూ చూడగా, పెట్టె కనబడదు. శృంగార నైషధముమాత్రము మంచంమీద ఉంది. ఒక్క క్షణంలో అంతా కండ్లగట్టినట్లైంది. సాయంత్రం వారపింటికివెళ్లి అన్నం తిని, రాత్రి చీకటిలో బండ్లవెంబడే బంగారు తండ్రి ఇరవైమైళ్లూ నడిచివస్తున్నట్లు కండ్లకు కనబడ్డాడు. కొడుకుకాళ్లమీద చెయ్యివేసి నిమురుతూ, ఒత్తబోయ్యేటప్పటికి, శ్రీహరికి ఆమహాతల్లి మనసులో ఉండేదుఃఖం తన్ని కొట్టినట్టయి, ఎక్కడలేని పొంగువచ్చి, కన్నీరు రాల్చాడు. వేడికన్నీళ్లు చేతిమీద పడగా కమలమ్మ తల యెత్తింది. "కేశవదేవుడా" అని తానూ కంట నీరుబెట్టింది. ఇదంతా చూచి పరుగెత్తుకొంటూ వెళ్లి భానును పిల్చుకొని వచ్చింది సరోజిని. ఏడుస్తూఉండే తమ్ముణ్ణి చూచేసరికి భానుమూర్తికి దుఃఖంవచ్చింది; కాని అణచుకొని అటూయిటూ చూచాడు; అంతా గ్రహించాడు. "ఎంతసేపైంది తమ్ముడూ వచ్చి?" అంటూ వచ్చి పక్కలో కూర్చొన్నాడు.

సరో—అన్నయ్య వచ్చి నిన్ను లేపకుండా నన్ను ఎత్తుకొని వచ్చి పండ్లుతోమి ముంతమామిడిపప్పు పెట్టాడు. ఇదో తింటున్నా.

భానుమూర్తి తమ్ముడు ఎందుకు వచ్చాడా అని ఆలోచిస్తున్నాడు. సెలవులు ఏమీ లేవు. కారణమేమిగా ఉండునో అనుకొంటుండగా, సరోజిని "ఇవ్వాళ నాకు అన్నయ్యతెచ్చిన ముంతమామిడిపప్పా,

తద్దినంవడలూ తిండానికి కావలసినన్నీ. అమ్మ నాకి ప్పుడు అన్నం వద్దే” అంది. భానుకు తద్దినం అని జ్ఞాపకం చేసింది చెల్లెలు. “ఇవ్వాళ ఖర్చు ఉన్నదే! అమ్మ ఎట్లా నడుపుతుంది? ఇస్తే తీసుకోదు” అని ఏమీ తోచక ఆలోచిస్తున్నాడు భానుమూర్తి. కమలమ్మ లేచిపోయింది.

## ౨

సరోజిని తనపాటికి తాను పప్పు ఒలుచుకొంటూ తింటూఉంది. శ్రీహరి వంచినతల యెత్తకుండా, ముడిచికలిపిన ఉంగరపువ్రేలూ బొటనవ్రేళ్ల మీద గడ్డం మోపి చూపుడునడిమివ్రేళ్లురెండూ చెంపచేర్చి, తనువు నేలను మనసు ఆకాశానగా ఉన్నాడు. భాను నైషధం అటూయిటూ తిప్పుతూ ‘తమ్ముడూ, ఈ ఒక్క నాటికికూడా పుస్తకం మోసుకరావాలా? బండిలో కూడా రాలేదే! ఒక్కనాటికి చదువు పోతే కొంప మునిగినట్లు ఏమిటె యీశ్రమ? మొన్నవచ్చినప్పుడూ ఇది లేదే! ఎప్పుడు కొన్నావు? ఎంతవెల? దీనికి అయిదురూపాయలు ఎక్కడ తెచ్చావు?

శ్రీహరి—కొత్తదిగా ఉందేగాని చెయ్యి మారినపుస్తకం రెండురూపాయలే. అయింది.

భాను—తమ్ముడూ, నీవు ఇక్కడ ఉంటే నేను దీనిని చదువుకోవచ్చును. మరి నీవు వెళ్లుతావు గదా. నేను చాలాకాలంగా నైషధం చదువుకోవలె నని సరదాపడుతున్నాను. ఇది నాకిద్దూ. ఎంత అయిందీ? అయిదు కదూ?

శ్రీహరి—కాదు రెండే. ఎంత అయితే నేమి? నీవు చదివి తరువాత నాకు ఇవ్వరాదూ?

భాను—తొందరగా చదవాలని నీకెంతో సర దాగా ఉండికదా కొన్నావు. నేను అయిదురూపా యలు ఇస్తాను. అక్కడికి వెళ్లికొనుక్కో. ఇది నా కియ్యి.

శ్రీహరి—నే నది రెంటికే కొన్నాను.

భాను—అయిదురూపాయ లని వెలవేసి ఉంటే రెం[illegible]ని చెబితే నేను నమ్ముతానా?

శ్రీహరి—చెయ్యిమారినపుస్తకమంటూంటే నే?

భాను—చెయ్యిమారిన పుస్తకము ఇట్ల ఉం టుందా, అచ్చులోనుంచి ఇప్పుడే వచ్చినట్లు?

శ్రీహరి—వాడినవాడిజాగ్రత్త. నేను అబ ద్ధము చెబుతానా?

భాను—పోనీ, మళ్లీ నీవు కొనుక్కోడానికి సిద్ధంగా చెయ్యిమారిన పుస్తకము దొరకదుకదా? కొత్తది అయిదురూపాయలకు కొనుక్కోక తప్పదు కదా? నీవో నేనో కొత్తది కొనక తప్పదు. నేను వ్రాసి తెప్పించడానికి పోస్టుఖర్చులు పైన పడతాయి. నీవైతే ఆఖర్చు లేకుండా అయిదు రూపాయలకు అక్కడ కొనుక్కోవచ్చు.

శ్రీహరి—వృథాఖర్చు ఎందుకనుకుంటే, ఇది నీవు చదువుకొంటూ ఉండు. నీ అయిదు రూపాయలతో అక్కడ కొని వచ్చేటప్పుడు తెచ్చి యిస్తాను. అంతేగాని, నేను రెండు రూపాయలకు కొన్నపుస్తకానికి నీవు అయిదురూపాయలు ఇస్తానంటే తీసుకోడానికి నేను కోమటిని కాను.

భాను—అట్లగే చేయి. ఇది నేను తీసుకొం టాను.

శ్రీహరి—అట్లగే నీపుస్తకము వచ్చేవరకూ.

బ్రతికాను దేవుడాఅనుకొన్నాడు భానుమూర్తి. ఎంత లేదన్నా నాలుగురూపాయలు లేనిది తద్దినం కాదు. తనను అమ్మ అప్పుకావలెననికూడా అడగదు; ఎందుకంటే, ఆమె లేవడితెలిసి భానుమూర్తి ఎంత దుఃఖిస్తాడో అని. అడగకుండా యిస్తే, “ఎందు” కని అడిగితే ఏమి జవాబు చెప్పడం? సరోజినిచేతికి యిస్తామంటే, పండగా, పర్వమా? అంతేకాక, ఇది వరకు అమ్మ కొట్టినప్పటినుంచీ, భానుదగ్గర ఏమి తీసు కోవలెనన్నా అమ్మ ఒళ్లుబిరగకొడుతుం దని భయం. ఇన్నిచిక్కులు ఉన్నవి. పోనీ తమ్ముడిచేతికి యిస్తామం

లే అమ్మకు మించినకొడుకు,ఆత్మగౌరవం కాపాడుకోవడంలో. అన్నదమ్ములవలె ఉన్నా, ఆసంబంధం డబ్బువిషయంలోకి రానీయడు శ్రీహరి. ప్రతిష్ఠకు ప్రాణం విడుస్తాడు. ఇదంతా ఆలోచించే, పుస్తకం తానిప్పుడు చదవాలని అనుకోకపోయినా, సరదా తెచ్చిపెట్టుకొని, పాతదని తెలిసీ, అయిదురూపాయలు తీసుకోమంటాడు. భానుమూర్తిమోసానికి లొంగి శ్రీహరి అట్ల తీసుకోడు. తుదకు ఒకరాజీమార్గానికి తెచ్చి, భానుమూర్తి మనిపర్సులో అయిదురూపాయలు తీసియిచ్చాడు.

## 3

కమలమ్మ గణపతిశాస్త్రియింటికి వెళ్లి "నాయనా, మీబావతద్దినం ఇవ్వాళ. అల్లుడు ఊరినుంచి వచ్చాడు. కార్యం జరిపిపోవూ?" అని అడుగుతుండగా, పక్కఊరి సుబ్బావధాని గుమ్మంలోనుంచే "ఒరే గణపతీ! రేపు పాలెంలో సంతర్పణరా. కొంచెం నడకశ్రమకు ఓర్చావంటే రూపాయ సంభావన రారా. చెప్పడానికేవచ్చాను," అంటూ లోపలికి వచ్చాడు.

గణ—రేపటిసంభావన సరేకాని, ఇంతదూరం వచ్చినవాణ్ణి ఊరకే పంపను నాకు ఇష్టంలేదు. ఇక్కడ తద్దినం; బ్రాహ్మణార్థానికిరా, అర్ధరూపాయ దక్షిణ.

సుబ్బా—అమ్మామ్మ, పంతులుగారి తద్దినం యీరోజేనా ? అయితే మీరు ఇక్కడికి రావాలా, ఈ వెధవాయని పిలవడానికి ? ఎంత వారు పోయినా, ప్రభుకుటుంబంలోవారనికూడా కనిపెట్టకుండా, మీ చేత పిలిపించుకొంటున్నాడా ? మొన్నటిదాకా మీ యింటికి వచ్చి పంచాంగం చెప్పుతూఉండిన గణపతికి పంతులుగారు పోగానే కండ్లు మీదకువచ్చాయా ?

అని కమలమ్మగారిని తన్ను పిలవడానికి వచ్చేంత అగౌరవం చేసినందుకు గణపతిని నాలుగు చీవాట్లు వేశాడు. పల్లెలలో ఆచారం ఎవరింట్లో ఏకార్యం ఏతిథినాడు జరిగేదీ తనఅబ్బశ్రాద్ధంవలె జ్ఞాపకం ఉంచుకొని, ఆయానాడు ఆయాయింటికి వెళ్లి వారికి జ్ఞాపకం చెయ్యడం పౌరోహితుడివిధి. ఇక కమలమ్మగారు దేశపాండ్యకుటుంబమువారు కాబట్టి, వారి యింటికి వెళ్లి గణపతికుటుంబమువారు ప్రతిరోజూ పొద్దున తిథివారనక్షత్రాలు చెప్పి వారుయిచ్చిన మోయిన తీసుకొనిపోవడం అనాదిగా ఆచారం.

వైదికవృత్తి అంటే పాడిబఱ్ఱెవంటిది. లేవడి కలలోకూడా కనబడదు. ఆవృత్తిని అందరూ చులకనగా చూస్తున్నారేగాని, దానివల్లనే గణపతి అందరికంటే మెరుగుగాఉన్నాడు. ఇప్పుడు నాలుగుకాసులువచ్చాయి గదా అని కండ్లు మీదకువచ్చాయి. కమలమ్మగారి యింట తద్దినమని తెలిసే, ముందురోజు వెళ్లి జ్ఞాపకం చెయ్యడం మాని, ఇప్పుడు ఆమెచేత పిలిపించుకొన్నాడు; అందుకు నాలుగుచీవాట్లూ తిన్నాడు.

సుబ్బావధాని గణపతిమీద కోపపడి, ఇటు తిరిగి, "అమ్మా, సమయానికి నేను రాబట్టి సరిపోయింది కాని, లేకుంటే ఒక్కబ్రాహ్మడితో తద్దినం సక్రమంగా ఎలాజరుగుతుంది? చాలాపనిఉందిగదా? అబ్బాయి వచ్చాడా? ఒరేగణపతీ, వదినెను పంపరా, తద్దినపువంట అమ్మగారు చేయలేరూ" అన్నాడు.

గణ—నిన్నటిరోజు ఇంట్లో రెండుకూరలూ, పప్పూ చేసేటప్పటికే మీవదినెకు ఆయాసం వచ్చింది. ఇక తద్దినపువంట చెయ్యడమే ?

సుబ్బా—ఔరా, కాలం! ఔరా, సుకుమారం! మొన్నమొన్నటిదాకా యీ గణపతి పెండ్లామే అమ్మగారియింట అంట్లుకూడా పనిమనిషికి అడ్డంపోయి తాను తోమేది. మరి యింతలో యీసుకుమారం ఎక్కణ్ణుంచి వచ్చిందో ? అమ్మా, మీరుపొండి. కాలకృత్యాలు తీర్చుకొని నేను వస్తాను వంటకు. వ్యగ్రతగా అనుకోకండి. అనాదిగా మీయింట పనిచేసి బతికినవాండ్లమే. మీరు పొండి తల్లీ, వస్తా నింతలో.

ఇలాగా సుబ్బావధాని మాటిమాటికీ బలవంత పెట్టగా కమలమ్మ నెమ్మదిగా కదిలింది. కాని ఏదో గణపతితో మాట్లాడ దలచి, క్రొత్తమనిషి వచ్చినందువల్ల మాట్లాడలేక పోయినట్లు వారికి తోస్తూనేఉంది. ఒక్కబ్రాహ్మడితో పితృకార్యం వెళ్లతీస్తామనే తల

పుత్రో ఆమె ఉండేంది. ఇప్పుడు గొప్పచిక్కు తెచ్చి పెట్టాడు దేవుడు. సుబ్బావధాని బ్రాహ్మణార్థానికి రావడమేకాక, వంటచేస్తానన్నాడు. వంటకు పైగా ఏమైనా ఇవ్వాలి. వద్దంటే వినడు; తోసుకొని వస్తాడు. స్థితి చెప్పుకోడానికి నోరు రాదు. ఆయన వచ్చేసరికి ఇంట్లో సామగ్రిఅంతా సిద్ధంగా లేకపోతే లేవడి బయటపడుతుంది. "భగవంతుడా! ఎందుకు ఆయనను తీసుకొనిపోయి నన్ను ఉంచావు? భూదేవీ, దారియిచ్చి ఇంతట నన్ను కడుపున బెట్టుకో" అని ఆమె ఏడవడమేకాని, యీ మొర్రలు భగవంతుడు వింటాడా? నెమలికంట నీరు కారితే వేటగాడికి ముద్దా? ఏమిచేయనూతోచక, కమలమ్మ నడుస్తూవుంది. ఎవర్నడిగితే నాలుగురూపాయలు అప్పు ఇస్తారు? అప్పైనా అడగడానికి అలవాటుపడ్డనోరు గాదు. అడిగి లేదనిపించుకోవడం మహావమానం. పాద్దెక్కుతూఉంది. సుబ్బావధాని వచ్చి గొంతుమీద కూర్చొంటాడు. ఏమిటిదారి దేవుడా? అనుకొంటూ అంగడి మీదుగా నడిచింది.

అంగడివాడిని అడిగితే అప్పు ఇవ్వనన్నాడు. కమలమ్మకు అప్పిస్తే తొందరలో ఆడబ్బు తేలదు. డబ్బు ఆలస్యం లేకుండా తిరుగుతుంటేకదా పిల్లలు పెడుతుంది? ఈమె కిస్తే యే సంవత్సరానికోగాని రాదు, అసలు వస్తే. అప్పటికి ఆనాలుగురూపాయలూ నాలుగ్గానే ఉంటాయి. పాపము బ్రతిమాలుకొంటుంది; వినడు, ససేమిరా అంటాడు. ఒకప్పుడు ఈకోమటే పంతులుగారు తనఅంగడిలో ఖాతా పెడితే బాగుండునని కమలమ్మభర్తచుట్టూ కనబడినప్పుడల్లా తిరిగేవాడు. ఇప్పుడు కమలమ్మ వచ్చి అడిగితే అప్పు ఇవ్వనన్నాడు. ఔరా! కాలం ఎంతతలక్రిందులైంది. ఓడలు బండ్లు అవుతాయి; బండ్లు ఓడలు అవుతాయి. అడిగినఅవమానమేకాక లేదనిపించుకొన్న అవమానంతో తలవంచుకొని ఆమె ఊరినుంచి వచ్చిన కొడుకును ఒక్కమారు చూచుకొని మరి తద్దినంసంగతి ఆలోచిస్తామని ఇంటికి వెళ్లగా కొడుకు లేడు. "అన్నయేడీ" అని అడగ్గా "సామానుకు అంగడికి పోయినా" డని సరోజిని చెప్పింది. "ఏఅంగడి"కంటే "ఏమో" అంది. కమలమ్మకు ఏమీ తోచలేదు. సామానుకు డబ్బు ఎక్కడిది? ఎవరైనా అప్పు ఇస్తారనుకొందామా? ఏది కావాలో, ఎంతకావాలో తన కేమితెలుసు? అనుకొంటూ తన కేమీ తోచక పిల్లను ముద్దాడుకొంటూ కూర్చొంది.

## ౪

ఇంతలో భానుమూర్తిగారి నౌకరిచేత సామాను ఎత్తించుకొని భానూ, శ్రీహరీ వచ్చారు. భానుమూర్తిని చూడగానే కమలమ్మకు కోపం వచ్చింది. తమ్ముణ్ణి మోసంచేసి తద్దినానికి డబ్బు ఇచ్చాడని గ్రహించి కోపంతో చూచేసరికి భాను అదలిపోయాడు. నెమ్మదిగా ధైర్యంతెచ్చుకొని "అమ్మా! డబ్బునాది కాదు, తమ్ముడిదే" నన్నాడు.

కమ—తమ్ముడి కెక్కణ్ణించి వచ్చింది?

భాను—నాకు నైషధం కొనితెమ్మని తమ్ముడి చేతికి అయిదురూపాయలు ఇచ్చాను. దానితో ఇప్పుడు సామాను కొన్నాడు. ఏది ఎంతకావాలో చెప్పడానికి నేను తోడే వెళ్లానేగాని మరేమీ కాదు.

వాడుకోడానికి చేతిలోకి డబ్బు వచ్చిందికదా అని బ్రహ్మానందమైంది కమలమ్మకు. వెనక ఏలాగో తేల్చి పుస్తకము కొని భానుకు ఇవ్వవచ్చు. ఆ క్లిష్టావస్థలో ఉన్న కమలమ్మకు మనసు ఇంతకుపైన పోలేదు.

వీరు మాట్లాడుకొంటూఉండగా నౌకరి సామాను తీసి కిందపెట్టాడు. కమలమ్మ నౌకరిని అన్నానికి రమ్మన్నది. భాను, తన్నుపిలుస్తుందేమో అని భయపడుతూ, ఏమిసాకు చెప్పి తప్పించుకోనా అనుకొంటున్నాడు. మరొకఆలోచన కలిగింది. శ్రీహరి మరుసటినాటిరాత్రికి వెళ్లుతాడు. శ్రీహరితో భోజనం మరి యెన్నినెలలకో? మంచిసందిగ్ధావస్థ కలిగింది. ఇదంతా మనస్సులో ఒక్కక్షణంలోకలిగిన ఆలోచన. "భానూ! నీవూ పద్మా ఇక్కణ్ణే ఇవ్వాళ. రేపు తమ్ముడు పోతాడు. మరెప్పటికో రావడం" అని కమలమ్మ పిల్చింది. తనతల్లి పోయినప్పటినుంచీ కమలమ్మే భానుకు తల్లి. అమ్మమాట తోసివేయగలడా? తమ్ముడు

ఉండేఒక్కనాడూ తమ్ముడితో భోజనం చెయ్యక ఓర్వగలడా?ఎట్లయితేనేమి?"అట్లగేఅమ్మా" అన్నాడు. ఇంతకూ తనమనసులో ఆలోచన యేమి? మంది యెక్కువఅయ్యేకొద్దీ మజ్జిగ పల్చన అన్నారు. నౌక రిని పిల్చింది. ఇక తానూ పద్మా మనిషికి మనిషి తోడయితే కష్టమౌతుంది. ఎవరు ఏమడిగినా లేదన రాదుకదా? కానీ చూతా మనుకొన్నాడు. ఒప్పు కున్నాడు. "చెల్లీ, వెళ్లి మీవదినెను పిల్చుకరా" అని సరోజినితో చెప్పాడు.

సరో:—వదినంటే ఎవరు?

భాను—దానిపేరు చెప్పిందాకా వదలదయ్యా యిక. పో, పద్మను పిల్చుకొనిరా.

సరో—పద్మా! పద్మ ఏమిటి గిద్మ. బాగు బాగు. నన్ను 'సరూ' అంటావా యిక? ఆకలై పేర్లు తింటావా?పూర్తిపేరు చెబితేనే.

భాను—పద్మావతి.

సరో—ఆఁహఁ.

భాను—పద్మావతమ్మ, పద్మావతమ్మ, పద్మా వతమ్మ.

సరో—పద్మావతమ్మ, పెండ్లామమ్మ, అమ్మ గారు, అలారా. ఇప్పుడు పిల్చుకొనివస్తా.

ఇలా అన్నను వేళాకోళంచేసి మరి వెళ్లింది.

❦

పద్మావతి వచ్చి ముందు మినప్పప్పు నానబోసి, తక్కినవన్నీ బాగుచేస్తూ "అత్తా, తద్దినంసంగతి నాకు చెప్పకపోయినావేమీ? పడమటింట్లోనుంచి 'పద్మా, వంటకు రావే' అంటే రాకపోయినానా? ఎంతపొద్దు పోయింది." అంటూ ఏమేమో మాట్లాడుతుండగా కమలమ్మ మడికట్టుకొంటా నని స్నానానికి లేచింది. చివాలున పద్మ లేచి, "వీట్లో రాళ్లు తీసియిచ్చి పైపని నీవుచెయ్యి. వంట నేను చేస్తా. ఇంతమందికి నీవు వండలేవు." అని పడమటింట్లోకి వెళ్లింది. ఒకరి మనసు ఒకరు కనుక్కొనేభావ యీభార్యాభర్తలకు బాగా వచ్చు. ఇంతలో భానుమూర్తి అటుతిరిగి వెళ్లి తనయింట్లో అయిదార్గురి మోయినసామాను అమ్మకు తెలేకుండా చూరులోగుండా ఇవతల పడమటింట్లో ఉండేపద్మకు అందించాడు. అవి దాచి తాను తొం దరతొందరగా తలస్నానం చేసి మడికట్టుకొని, వంటమొదలుపెట్టింది. ఇంతలో సుబ్బావధాని స్నానంచేసి వచ్చి తిన్నగా వంటయింట్లోకి వెళ్లేసరికి వంట అవుతూఉంది. పైకివచ్చి "అమ్మా, నేను వస్తూఉండగానే ఇంతతొందరా? నాకు పని చెప్పడానికే యింతమొగమాటమైతే యెలాతల్లీ? మీ మామగారినాయన ఆదిమూర్తిగారు దానంచేసినఅగ్రహా రంలో నాభాగానికి అయిదువందలరూపాయలు వస్తు న్నాయి. మూడుతరాలుగా మావంశమంతా పుష్కలం గా బ్రతుకుతున్నామే! మీబిడ్డలము. నాకు పనిచెబితే ఋణపడతారా? కానీండి, ఏమిచేతాం? మీ రేపని చెప్పి నా చెప్పండి, చేస్తా. మీరు చేస్తుంటే చూడలేను. మీ అబ్బాయినిఒకటిగా నన్నొకటిగా చూచుకోకండి;"అం టూ తడిగుడ్డలువిచ్చి పొడిగుడ్డలుకట్టిదొన్నెలూ,దర్భలూ తయారు చేస్తూ నమకచమకపారాయణం చేస్తున్నాడు. కమలమ్మ ఏమిచేయబోయినా ఏమితేబోయినా తాను అడ్డముపోతాడు.

ఎట్లయితేనేమి, వంటఅయింది పద్మావతి వచ్చి "ఇక లేవవచ్చు" నన్నది. "ఈమె ఎవరమ్మా?" అని అవధాని అడగగా, "మాభానుమూర్తిపెండ్లాముకదూ నాయనా" అని కమలమ్మ బదులుచెప్పింది. అది మొదలు సంభాషణకు. అటువంటిసమయాల్లో ఇంటి వారికీ బ్రాహ్మలకూ జరిగేసంభాషణ స్వభావం అ విన్నవాండ్లకే తెలియాలి. కర్తయొక్క పెద్దలు చేసిన గోదానాలు, భూదానాలు, కన్యాదానాలు చెప్పి పెద్ద లను పొగడడం. మామూలుగా ఈఔదార్యాన్ని గోరం తలు కొండంతలుచేస్తారు. ఎందుకనుకొన్నారు? దక్షిణ దగ్గర కర్త వెనకతియ్యకుండా ఉండడానికి. పెద్దలను పొగిడితే, ఎవడు వశంగాడు? అట్లని కమలమ్మగారి కుటుంబమువారు చేసినదానాదులు అల్పాలని కాదు. సుమీ. ఆమెమామగారినాయన సంవత్సరానికి రెండు

వేలువచ్చే అగ్రహారాన్ని ధారపోశాడు. ఆఅగ్రహారపు పేరు పోయి ఆయనపేర ఆదిమూర్తిపురం అనేపేరు నిల్చింది.

ఈతద్దినపుసంభాషణ జరుగుచుండగా, గణపతి వచ్చాడు. బ్రాహ్మలు స్నానంజేశారు. మంత్రం మొదలు పెట్టారు. సుబ్బావధాని సక్రమంగా ఆద్యంతాలూ బాగా జరుపుదామనే ఉద్దేశంతో ఉండగా, గణపతి అడ్డంవచ్చి తాను మంత్రం చెబుతానన్నాడు. గణపతికి మంత్రం రాదని అవధాని యెరుగును. గణపతి శాస్త్రికి శాస్త్రినామం నామకరణంలో వచ్చిందే గాని, శాస్త్రజ్ఞానంవల్ల వచ్చింది కాదు. అయినా "మీరు రాజపురోహితులు. మీవెనకనే మేము" అని అవధాని సర్దుకున్నాడు. గణపతి అయిదునిమిషాల్లో మంత్రం ముగించాడు. "అపవిత్రః పవిత్రోవా" లగాయతూ "కాయేనవాచా" ఆఖరువరకూ "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు" అన్న కలికాలపుసంధ్యలాగా, మంత్రంలేని సంధ్యకు మరిచెంబెడు నీళ్లన్నట్టు, గణపతి పెట్టించే తద్దినానికి తంత్రలోపం లేదు, మంత్రం సన్నమైనా. అక్కడ కానీ, యిక్కడపరకా, అప్పుడు అణా, యిప్పుడు బేడా అని మంత్రపుడబ్బులక్రిందనే రూపాయ లాగాడు. ఇదే ఇంతైతే దక్షిణ ఎంత కావాలి?

వడ్డించవచ్చునన్నాడు గణపతి. సరోజిని వెళ్లి భానును పిల్చుకొనివచ్చింది. పిండాలు ముందే చేయించి, అంతా ఒకటిగా కూర్చొన్నారు. భోక్తలకు భోజనమైనతర్వాతకదా కర్తకు తిండిఅంటే, అక్కరలేదన్నాడు గణపతి. ఈనియమాలు అట్టే అక్కరలేదు. అతనికి దక్షిణనియమం తప్పకుంటే చాలు. అవుపోసనం పట్టడమే ఆలస్యం ఇక ముందుపు రోహితుడు పడితేనే గాని ఇతరులు పట్టరు. గణపతి ఎంతసేపటికీ పట్టడు. అవధానిచేత నీళ్లు పోసుకొని, ఎడమచేతివ్రేల విస్తరి ముట్టుకొని ఉన్నాడు; 'కానీరా' అంటాడు. ఆఖరుకు 'దక్షిణ' అన్నాడు గణపతి. "సిగ్గులేనిమనిషివిగా ఉన్నావు. నీదక్షిణ ఎగవేస్తారట్రా? ఏడ్చావులేకానీ; తారతమ్యం అక్కరలేదూ?" అని చీవాట్లు వేసేటప్పటికి గణపతి అవుపోసనం బట్టాడు.

నెయ్యివడ్డనలో చాలుఅనేవరకూ వడ్డించాలి. గణపతి వేళ్లు సందులుగా పట్టుకొని, ఎప్పటికీ చాలుననడు. నేతిగిన్నె ఖాళీఅయినా చేర నిండదు. పద్మావతికి భయం వేసింది. ఇక అందులో అదితక్కువ, ఇందులో ఇదితక్కువ అనడం; రెండోపిండివంట లేదని ఆక్షేపణ: పరమాన్నంలో బెల్లం వేసినందుకు తప్పుపట్టడం. భానుమూర్తికి కోపం వస్తూఉంది: ఏమీ అనగూడదు. ఏమిచెయ్యడం? ఇక పట్టలేక, "తద్దినపు పాయసంలో పంచదార పనికిరాదుగదా?" అన్నాడు. "వీటికంతా శాస్త్రాలేమిటి?" అని గణపతిజవాబు.

ఎట్లాయితేనేమి, భోజనాలు అయినవి. కమలమ్మ "నాయనా, శ్రీహరీ, తాంబూలు ఇయ్యి" అనగా అబ్బాయి అర్ధఅర్ధరూపాయ పెట్టి తాంబూలాలు ఇచ్చాడు. అవధాని ఆశీర్వదిస్తూండగా గణపతి తాంబూలం క్రిందపెట్టాడు. శ్రీహరి 'తాంబూలం తీసుకోండి శాస్త్రిలుగారూ' అని బతిమాలుకొంటాడు.

గణ—మీతాతగారు మానాయనకు ప్రతి తద్దినానికీ గోదానం చేసేవారు. మీనాయన పంచలచాపు ఇవ్వడం మామూలు. అదీపోయింది మీకాలాన "నానాటికి తీసికట్లు నాగంభొట్లూ" అన్నట్టు. అందుకూ అనను. పెదవి కదల్చని అవధానికీ అర్ధరూపాయా, మంత్రంచెప్పిన నాకూ అర్ధరూపాయానా? ధర్మమా?

భాను—తమ్ముడూ, మరోపావలా ఇయ్యి.

శ్రీహరి—(పావలాపెట్టి) తీసుకోండి శాస్త్రిలుగారూ.

గణ—(తీసుకొని) అయితే మూడోబ్రాహ్మడే కూర్చొనిఉంటే తాంబూలము ఇవ్వవలసిందేగదా? గంధపుచెక్క పెట్టామంటే బ్రాహ్మడు ఉన్నట్టే. ఆతాంబూలం నాకు వస్తుంది, రాజపురోహితుణ్ణి కాబట్టి.

ఇంతటికి భానుమూర్తికి వచ్చిన కోపానికి మేర లేదు. కాని తద్దినపుబ్రాహ్మణ్ణి యేమనగలడూ? నాగ

రకహాస్యంగా, "మీభోజనానికి పైగా మూడో బ్రాహ్మడి పాలు మీరు తింటే, మీకు ఆదక్షిణ వస్తుంది. లేదా గంధపుచెక్కచేత తినిపించండి దానికిస్తాం" అన్నాడు. "బ్రాహ్మడిమర్యాద గంధపుచెక్కకు జరపాలి. లేకుంటే బ్రాహ్మడే నని గంధపుచెక్కను ఎందుకు పెట్టడం?" అని గణపతి అన్నాడు. "నిజమే, అదితిని తీసుకుంటే" నని భానుమూర్తి అన్నాడు. అంతట అవధాని నాలుగుచీవాట్లువేసే సరికి ఆకర్కోటకుడు, "నీ సొమ్మేం పోయింది, నాకు వచ్చేడబ్బులు పోతే" నంటూ అక్షేపంతో తాంబూలం అక్కడపెట్టి లేచి పోయినాడు. "తీసుకోరా గణపతీ" అంటూ అది పట్టుకొని అవధాని వెనకనే వెళ్లాడు.

"మంచీచెడ్డా, న్యాయం అన్యాయం ఆలోచించరుగదా యీకర్కోటకపు బ్రాహ్మలు" అని భానుమూర్తి అన్నాడు.

కమ—అలాఅనకు నాయనా! తప్పు. పితృకార్యం జరిపిన బ్రాహ్మడిలో పితృదేవతలు ఆవహించి ఉంటారు.

భాను—వీడిలో పితృదేవతలే ఆవహించిఉంటే ఆపితృదేవతలు వీణ్ణి యిలా ప్రవర్తించనిస్తారా?

కమ—వాండ్ల కులాచారం అది.

భాను—ఆకులమేగదా సుబ్బావధానిది. ఆయన చూడూ, ఎంతసౌమ్యంగా ఉన్నాడో!

* * * *

కష్టపడి వంటచేసినపద్మావతికి ఆకలి అవుతూంది. వృథాగాపొద్దుపోవడం ఎందుకని "అత్తా! లేచిరావూ?" అని పిలవగా, కమలమ్మ లోపలికి వెళ్లింది.

## ౬

భాను—తమ్ముడూ, నీవైనా అమ్మకు చెప్పుదూ. లక్ష్మివంటి యీపిల్లకష్టము చూస్తే గుండె నీరైపోతుందీ. జాతీనీతీలేని నీచులకు ఐశ్వర్య మిస్తాడు వెధవదేవుడు. శౌర్యమానవంతులకు తిండికి లేకుండా చేస్తాడు. మొన్నటిరోజు అమ్మ చెల్లెను కొడితే నాగుండె బద్దలయింది. ఈముద్దులుగులికే లక్ష్మికా యీ కష్టాలు?

సరో—అన్నయ్యా, అన్నయ్యా, బావ వచ్చి పోయినప్పటినుంచీ అమ్మ నెయ్యిలేకుండా అన్నం పెట్టుతూంది.

శ్రీహరి—దానికితోడు కొట్టడమెందుకూ?

సరో—రాత్రి నేను యేడిస్తే నెయ్యివెయ్యడానికి ముంతతెచ్చింది.

(లోపలినుంచి) సరోజినీ, ఏమిటది?

సరో—(నోరుమూసుకొంది.)

భాను—తమ్ముడూ, ఈవెధవతద్దినంనాడు యీ కర్కోటకపువైదీకులకు పిండివంటలు చేసిపెట్టడానికీ, ఎంతటికీనిండని కన్నాలచేరలలో పొయ్యడానికీ నని కూడవేస్తూ, బంగారుతల్లికి కడుపుకాలుస్తూ, వారం రోజులు నెయ్యి లేకుండా తల్లి అన్నముపెట్టడమా? వివేకానందులవారు "మూఢాచారాలలోబడి జీవనము దుర్భరమాతున్నది" అన్నమాటకు అందరికీ అర్థము తెలుస్తుందా? ఎన్నికష్టాలు అనుభవించాలి, లేక ఎంత లోకవిమర్శన ఉండాలి?

సరో—అయితే, అన్నయ్యా, వీండ్లకోసమా నాకు నెయ్యిలేకుండా చేసింది?

శ్రీహరి — వాండ్లకోసంగాదు చెల్లీ, తద్దినం కోసం. ఇవ్వాళ మనయింట్లో తద్దినంగదూ!

సరో—అంటే?

శ్రీహరి—అప్ప చచ్చిపోయినరోజు ఇవ్వాళ. ఆయనకు ఇవ్వాళ అన్నము పెట్టాలి. పెట్టకుంటే ఆకలికాదూ?

సరో—అయితే, మనశాస్తుర్లూ ఇంకెవరో ఒకాయనా వచ్చారు గాని, అప్పవచ్చాడా? వస్తే నాకేమీ తిండానికి లేదూ?

శ్రీహరి—చచ్చిన అప్ప ఎట్లా తెస్తాడు?

సరో—ఎట్లా వచ్చి తింటాడో అట్లనే.

శ్రీహరి--అట్లకాదు చెల్లీ. వీండ్లకు పెడితే ఆయనకు ఆకలి తీరుతుంది.

సరో--బహుబాగు! -- అయితే నీవు చదువుకొంటుంటే ఇక్కడ ఎవరన్నా తింటే అక్కడ నీకు ఆకలి తీరుతుందా?

భాను--ఒక్క ముద్దు. ఎదీ, మరో ముద్దు.

సరో--నీపేరు చెప్పి ఈ అన్నయ్యకు ముద్దుపెడతాను; నీకు ముద్దు పెట్టినట్టే.

సరోజినికి జవాబు చెప్పలేక ఒకర్ని మార్చి ఒకరు ముద్దుపెట్టుకుంటూ నలిపేసరికి, అక్కణ్ణుంచి పారిపోయింది.

భాను—తమ్ముడూ, మతగ్రంథాలేమైనా చదివావా?

శ్రీహరి—అట్టే చదవలేదు. తీరిక ఉంటేకదూ? నీకంటే బడిచదువూ, పరీక్షబెదురూ లేదు కాబట్టి అన్నీ చదువుతావు.

భాను—వివేకానందులవారిగ్రంథాలన్నీ చదివావా లేదా?

శ్రీహరి—నీదగ్గరనే గదా చదివాను?

భాను—అవి చాలు. పరిశోధన చేసేజ్ఞానం కావలసినంత కలుగుతుంది. శ్రాద్ధమంటే యేమిటి?

శ్రీహరి—అనగా శ్రద్ధతో కూడినది.


భాను—అవును. అంటే పెద్దలు ఏసత్కార్యాలు చేస్తూఉండిరో వాటినిపుత్రులుశ్రద్ధతో చేస్తే పెద్దలు పరితృప్తులౌతారు. అంతే గాని వారిపేరు బెట్టి నీవు భప్పళాలు కొట్టడంగాదు. ఆలోచించు. నీకు చెప్పే దేమిటి? విమర్శనశాస్త్రము చదివే ఉంటావు గదా. పోనీ, పామరజనుల విశ్వాసాన్ని బట్టి పెద్దల ఆకలి తీరుస్తామనే భావతోం ఆలోచిస్తాము.



"తీసుకోరా గణపతీ" అంటూ అది పట్టుకొని

నీఆకలి నీవు తీర్చుకోలేవు, పితృదేవతల ఆకలి తీరుస్తావా యిక ?

శ్రీహరి— ఈవిషయ మై అట్టే నేను ఆలోచించలేదు. ఇద మిత్థ మని జవాబు తేల్చిచెప్ప లేను.



అవధానివెనకనే వెళ్లాడు.

భాను — చచ్చిపోయిన తర్వాత పితృదేవతలు ఇంకా వచ్చి నీ పిండాలు తింటున్నారనే అనుకొంటున్నావా ?

శ్రీహరి—వచ్చి తినరని నీ వెట్లు చెప్పగలవు ?

భాను — పిండాలు ఖర్చుకావడం లేదు కాబట్టి.

శ్రీహరి—తమాషా కాను. దివ్యజ్ఞానసభవారు మరణించినవారి జీవులను పిలిచి వాటితో సంభాషణలు జరుపుతున్నారే ?

భాను — వస్తున్నాయనే అందాము. నీ పిండాలు వాటికి కావలె నని సిద్ధాంత మేమిటి ? తిలకుగారి ఆత్మను 'నీదినచర్య యేమిటి ?' 'అని అడిగితే దేశాలు తిరిగి ఇండియాకు స్వరాజ్యము సంపాదించే ప్రయత్నమే' నన్నాడు. ఆకలి దప్పికలు లేవని చెప్పాడు.

శ్రీహరి — ఆయనకంటే లేకపోవచ్చు. సామాన్య మానవులకో ?

భాను—ఇందులో దిగితే, మన మతం ఒక మహారణ్యం. ప్రతి సిద్ధాంతానికీ విరుద్ధంగా పదిసిద్ధాంతాలు ఉన్నాయి. ఎవడి కర్మనుబట్టి వాడు కర్మఫలము అనుభవించడానికి పోతున్నాడనే కర్మసిద్ధాంతం ఉండగా, ఇక నీపిండాలు వాడికి ఎందవుకదా ?

శ్రీహరి—పుత్రుడంటే 'పుం' అనే నరకమునుండి కాపాడేవాడు. శ్రాద్ధమువల్ల ఆకార్యము సాధ్యమాతుంది.

భాను—చేసినకర్మకు ఫలము తప్పదుకదా అను. ఇక ఒకడు మంచికర్మ చేసిఉంటే వాణ్ణి అదే రక్షిస్తుంది. లేకపోతే నీపిండాలు అతణ్ణి రక్షించలేవుగదా? అట్లు రక్షించడమే సాధ్యమైతే దుష్కర్మచేసినవారిని శ్రాద్ధాదికకర్మలచేత డబ్బుగలపుత్రులే రక్షించగలరు; లేనివారురక్షించలేరు. దీన్నిబట్టి, డబ్బుగలవారు దుష్కర్మచేసినా వారికి భయం లేదు. లేనివాడు చేస్తేముక్తి లేదు. అనగా, దేవుణ్ణి డబ్బుగలవారు కొనివెయ్యవచ్చునన్నమాట. ఇదే మనమతమైతే నా కక్కరలేదు.

శ్రీహరి—ఆఅభిప్రాయముచాలామందికి ఉన్నదిసుమీ.

భాను—ఇంకొకవిషయము. పితృదేవతలన్నాము. వారిని దేవతలనుగా భావించి భక్తితో ఆరాధించేవేళను ఈచండాలపు బ్రాహ్మణనామకులను వారిస్థానంలో కూర్చోబెట్టడమా? తాగుబోతులూ, ముండలముతాకోరులూ, అసత్యవాదులూ,అన్యాయకారులూ నా పితృదేవతలస్థానం ఆక్రమించేవారు? పితృస్థానం ఆక్రమించగలవాడేడీ?

శ్రీహరి—ఆవిషయంలో సందేహం లేదు. నిజమైనబాహ్మడు నీకు చిక్కడు. మాళవ్యాగారిని 'మనదేశం బాగుపడడానికి ఏమికావలె'నని అడిగితే 'నిజమైనబ్రాహ్మలు కావలె' నన్నాడు. అంటే వారు లేరన్నమాట.

భాను—ఇక శ్రాద్ధభోజనమే పితరులకు అవసరమనుకొందాము. మనలో ఎవడైనా సన్న్యాసం పుచ్చుకొన్నవాడు మరణిస్తే, వాడికొడుకు ఆరాధన అని ఒకపితృకార్యం చేస్తాడు. అందులో తాతముత్తాతల పోలూపొంకూ రాదు. తండ్రిని ఆరాధించడమే. అట్టివిషయంలో, ఈయన సన్న్యాసం పుచ్చుకొన్నాడని, ఈయన తండ్రితాతలు తిండిమానుకొంటారా? మరిన్నీ, ఏమీవద్దని సన్న్యాసంపుచ్చుకొన్నవాడిని బలవంతమాఘుస్నానంగా సంసారంలోకి లాగి నీవు అన్నంపెడితే, వాడు వస్తాడా? తింటాడా? సంసారంలోనే వున్న తాతముత్తాతలను తలచవు; వారి ఆకలి చస్తుందా?

శ్రీహరి—పితరులకు అన్నమే అవసరము అయితే, కొడుకు సన్న్యాసి అయినమాత్రాన ఆయనకు ఆకలిపోతుందా? ప్రకృతివిరుద్ధము.

భాను—ఇక ఆధ్యాత్మికంగా ఆలోచిస్తాం. మన ఆధ్యాత్మికసారస్వతసారం భక్తీ,సద్వర్తనమాత్రమే ప్రధానము అని. జ్ఞానియైనవాడు ప్రతివాడూ, ఈజపతపాలూ, ఈపితృకర్మలూ అనవసర మంటున్నాడు. సన్న్యాసాశ్రమము మనజీవనంలో పరమావధి. అది సత్యమని అందరూ ఒప్పుకొంటారు. అదే సత్యమైతే, ఈ అసత్యంతో మన కేమిపని? సత్యం అవలంబించడం, అసత్యం విసర్జించడం యోగుల కేమి, కాని వారికేమి? అందరికీ అవసరమే. "వారు యోగులు; వారికి సత్యం ప్రధానం. మనం సంసారంలో ఉన్నాము. మనకు ఈఅసత్యమే ఉండవలెను." అని జ్ఞానం గలవాడు ఎవడూ అనడుగదా? అసత్యం వదలేకొద్దీ జన్మ పవిత్ర మౌతుంది. క్రమక్రమంగా పవిత్రమైతేనే కాని ఆత్మజ్ఞానం గలుగదు. ఒక్కమారు యోగులమయ్యేవరకూ అసత్యమే పట్టుకొనిఉందాం అంటే అందులో తెలివేమిటి?

శ్రీహరి—నాకు చాలాకాలంగా మనసులో ఒకఆలోచన ఉంది. ఈమూఢత్వానికంతా స్వార్థపరులైనబ్రాహ్మలు కారకులని.

భాను—అది రూఢి.

శ్రీహరి—ఈ మూఢాచారాలు మనకే కాదు, అన్నిజాతులవారికీ ఉన్నవి.

భాను—శ్రాద్ధము, మళ్లీ, కేవలము మూఢాచార మనడానికి వీలులేదు. మూఢులచేతులలోబడి మూఢమైంది. నీవు చెప్పినట్టు ఈమూఢాచారాలు అన్నిజాతులవారికీ ఉన్నవి. మనకూ ఉన్నవి. ఇవన్నీ మన వేదమతానికి సమ్మతములు కావు. అని వేదములుబాగుగా పరిశీలించినవారు చెబుతారు. కాని ఇవి ప్రాచీనాచారాలక్రింద నిల్చినవి. వేదం దైవదత్తము,అపౌరుషేయము

అనిచెప్పువారు వేదములో చెప్పినట్లు ఎందుకు నడుచుకోరు ? అందులో చెప్పినట్లు నడుచుకోవాలి, లేకుంటే దానిని వదలుకోవాలి. ఇకసంప్రదాయమూ, ఆచారమూ అంటే ఎవరు ఏర్పరచిన ఆచారం ఆచరణీయమని నిర్ణయించడం? తరతరాలుగా పెద్దలు చుట్టలు తాగితే పుట్టేవారు తాగాలి; ఆచారం విడువరాదు గదా ? అట్లయితే నేను ఒకఆచారం ఏర్పాటుచేస్తాను, సురాచారం. సంప్రదాయమని ఇక తరతరాలవారూ ఆచరించకతప్పదు. ఆలోచిస్తే యీవంశాచారాలూ, సదాచారాలూ అనేవి కొన్ని పరమమూఢాచారాలు మనను తినేస్తున్నవి. ఈకర్మమూవత్తూ అనవసరమని జ్ఞానులు చెప్పనేచెప్పారు. మనమే అడుసులో పడ్డ పిల్లికి అదేవైకుంఠ మన్నట్టు బాధపడుతున్నాము.

శ్రీహరి--ఈచిక్కంతా వదలించుకొని మన కర్మలన్నీ సంస్కరించుకొనవచ్చునుగదా ?

భాను-- శ్రాద్ధకర్మ కేవలము చెడ్డదికాదు. మానవుడికి ఎప్పుడూ ఉదాహరణభూతంగా మార్గదర్శిగా ఒకడు ఉండాలి. ఊరక "సత్యంవద", ధర్మంచర" అని ధర్మసూత్రాలు చెప్పినంతమాత్రాన ప్రపంచం బాగుపడదు. ఆవిధంగా ఒకవ్యక్తి ఆచరిస్తే, అందరికీ అతన్ని చూచి ఉత్సాహమూ, తెంపూ, నీచజీవనంమీద రోతా పుట్టి మంచిదారి తొక్కుతారు. ఆవిధంగా కష్టాలెన్నో పడి సత్యవ్రతమాచరించిన మహాపురుషులను అప్పుడప్పుడూ సాధ్యమైతే ఎప్పుడూ స్మరిస్తుంటే, భ్రమరకీటన్యాయంగా వీరిజీవితాలు బాగుపడతాయి. అందుకోసమని పోయినవారిని శ్రద్ధతో స్మరించడం, అనగా శ్రాద్ధంపెట్టడం. అంతేగాని, చండాలపుబ్రాహ్మలకు పెట్టడానికని కన్న బిడ్డలకు కడుపులు కాల్చడం గాదు. తమ్ముడూ, నేను చెప్తాను విను. సత్యంగా చెల్లెలికి వారంగా నెయ్యి ఉన్నట్టు కనబడదు. ఈవిధంగా మనదేశంలో ఎన్నివేలకుటుంబాలు ఉంటాయంటావు? వారందరికీ ముక్తియెన్నటికి ?

శ్రీహరి — మనమేమిచెయ్యగలము ? లోకం అంతా మరామత్తు చేయగలమా ? నేనొక్కణ్ణి, నీవొక్కడివి.

భాను--అట్లనకు, 'నేనొక్కణ్ణి, నీవొక్కడివి' అంటావేమి ? 'మనమిద్దరము' అనరాదూ ? మనమధ్య ఉండే భగవంతుడితో ముగ్గురము. ఇక ప్రపంచాన్ని ఎదిరించవచ్చు. సత్యం మనపక్క ఉన్నంతసేపూ భయ మెందుకూ ? కష్టానికి వెరవడం నీచలక్షణం. ధర్మానికి కష్టాలుపడ్డవారే శాశ్వతప్రతిష్ఠ సంపాదించి విశ్వజీవనానికి మూలకారకులౌతున్నారు.

శ్రీహరి--అయితే మనం సదుద్దేశంతో మూఢాచారాలను తుంగలోతొక్కినా, ప్రస్తుతం డబ్బులేక ఉన్నందువల్ల, గతిలేక సదాచారాలు మానారు అంటారు.

భాను--అంటే అననీ. భయమెందుకు ? ఎల్లకాలమూ నీవు డబ్బులేకనే ఉంటావా ? ఇక రెండు నెలల్లో బియ్యేపరీక్ష అవుతావు; ఉద్యోగం చేస్తావు. అప్పుడు అయిదురూపాయలు లేక తద్దినం మానాడు అనలేరుగదా ? దానికి తోడు లోభితనం దగ్గరచేరనీయకుండా సద్వ్యయం చేస్తుంటివా, అందరూ నిన్ను చూచి హర్షిస్తారు. ముందు అనుమానించినా, నెమ్మదిగా నీదారికే వస్తారు. తెలేనివారు తెలియక మౌఢ్యంలో ఉండీ, తెలిసినవారు భయంలో, మౌఢ్యంలో ఉంటే తరించడ మెన్నటికి ? విద్యావంతులు మార్గదర్శకులు కావాలి. ప్రతిఆచారమూ శోధించి, చెడ్డాచెత్తా మాని, మంచిమంచిరీతిన ఆచరిస్తాము. అందరికీ జీవనం కొంచెం సాధ్యంగా, రుచిగా చేతాం. తమ్ముడూ, ఇదే కంకణంగట్టాను. ధర్మసేవకుడ నైనాను. నీతో ఇద్దరమూ, దేవుడితో ముగ్గురమూ, ఇకేమి ? దీర్ఘంగా ఆలోచించి సత్యమని తోచింది విశ్వమంతటా వెదజల్లుదాం.

శ్రీహరి—ఇద్దరమా ?

భాను—మళ్లీ ఆమాటఅంటావు ? బౌద్ధమతకర్త బుద్ధుడు మొదట ఒక్కడే ఒకపక్షము. మొదట క్రైస్తు ఒక్కడు; మహమ్మదు ఒక్కడు. సత్యం తోడైతే, ప్రపంచమంతా ఎదిరించినా ఏమిభయం ? ముందు ఎదిరించినా, వెనక నీకు పాదాక్రాంత మౌతుంది.

శ్రీహరి--మౌఢ్యవిముక్తి సమాజం లేవదీస్తాము. దేవుడితో ముగ్గురమూ మొదటిసభ్యులం, నీవన్నట్టు.